ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
మంగళవారం | ఆగస్టు 11, 2026 | సంపుటి : 7 | సంచిక : 63 | పేజీలు : 2

ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు పెద్ది

ఎంతకాలం బతికామనేది ముఖ్యం కాదు..
ఎట్లా బతికామనేదే ముఖ్యం
నర్సంపేట మెడికల్ కాలేజీకి
పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతాం
మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
నల్లబెల్లిలో ఘనంగా పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభ

వరంగల్, ఆయుధం: ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలిపచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తే తెలుపడానికి ఇదే నిదర్శనం'' అని అన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ''ఉద్యమ గడ్డ వరంగల్ జిల్లాలో ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకుడికి, ఒక తెలంగాణ ఉద్యమ గడ్డ ఇచ్చిన అసలైన గౌరవమిది. ఓరుగల్లు ముద్దుబిడ్డ పెద్ది సుదర్శన్ రెడ్డి కి నర్సంపేట ప్రజలు అశ్రునయనాల మధ్య వీడ్కోలు పలికారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర, చూపిన తెగువ ఎప్పటికీ అమరం'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

పెద్ది పోరాటం, తపన పదిలం: హరీశ్ రావు

పెద్ది సుదర్శన్ రెడ్డి తో తనకు రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా ఆయనతో కలిసి అనేక పోరాటాల్లో, ఉద్యమాల్లో, ఉపఎన్నికల్లో పనిచేశానని గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. భౌతికంగా సుదర్శన్ రెడ్డి మన మధ్య లేకపోయినా.. ఆయన చేసిన పోరాటం, ప్రజల కోసం పడ్డ తపన, ఆయన జ్ఞాపకాలు మన గుండెల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటాయని హరీశ్ రావు పేర్కొన్నారు.

వర్షా లు సమృద్ధిగా కురవాలి

- ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా జీవించాలి
- మహా వరుణయాగంలో పాల్గొన్న సీఎం రేవంత్ దంపతులు
- పూర్ణాహుతితో ముగిసిన యాగం

నల్గొండ, ఆయుధం: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని దేవీదేవతలను వేడుకుంటూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయ్ విహారం వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ పవిత్ర వరుణ యాగంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో యాగక్రతువులను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాలతో వరుణదేవుని అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ వైదిక విధానంలో హోమ క్రతువులు నిర్వహించారు. ఈ పవిత్ర యాగంలో మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ఈ వరుణ యాగం నిర్వహించామని తెలిపారు. భారతీయ సంస్కృతిలో వర్షాలు కురవాలని యాగాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయం. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తూనే వర్షం, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం పరస్పర సంబంధాన్ని ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రకృతి అనుగ్రహించాలని వేడుకున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించింది. "రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి. కృష్ణా గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి. శ్రీశైలం, నాగార్జునసాగర్ లతో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలి. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళతో కళకళలాడాలి. భూగర్భ జలాలు పెరగాలి. పంటలు పుష్కలంగా పండాలి. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలి" అని ముఖ్యమంత్రి వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ పవిత్ర వరుణయాగ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవ రావు, పి.సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేయండి

కేంద్ర మంత్రిని కలిసిన తెలంగాణ బీజేపీ నేతలు

హైదరాబాద్, ఆయుధం: వరంగల్‌మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక ఆమోదం తెలిపినందుకు గాను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కి మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారామ్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్, ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. వన్నాల వెంకటరమణ తో కూడిన బీజేపీ నాయకుల బృందం కలిసింది. న్యూఢిల్లీలో జోర్బాగ్ సాఫ్దారగంజ్ లోని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యాలయంలో మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఒక అధికారిక లేఖ అందజేశారు. తెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజల దశాబ్దాల కాలం నాటి చిరకాల వాంఛ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చూపిన చొరవ, ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. తాను మహబూబాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో వరంగల్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని, ఆ కల నెరవేరుతుండటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని లేఖలో ఆజ్మీరా స్మరించుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన కొత్తలో కేంద్ర మంత్రితో జరిగిన భేటీని గుర్తుచేసుకుంటూ.. రామ్మోహన్ నాయుడి నిరాడంబరత, అందుబాటులో ఉండే స్వభావం మరియు చురుకైన నాయకత్వం స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ పర్యటనకు విచ్చేయాల్సిందిగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను బీజేపీ బృందం ఆహ్వానించింది. మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టు శంకుస్థాపన లేదా అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ఈ ప్రాంత ప్రజలను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి రాక తెలంగాణ ప్రాంత అభివృద్ధికి, కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా అదిలాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి వెంటనే శ్రీకారం చుట్టాలని అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను కోరారు. అలాగే మామునూరు విమానాశ్రయంలో భూములు కోల్పోయిన కుటుంబాలకు, సమీప ప్రాంతం లోని ప్రజలకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ కేంద్ర మంత్రి ని కోరారు. తెలంగాణ బీజేపీ నేతలు అందించిన వినతులను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులను బీజేపీ బృందం సత్కరించింది.



వరంగల్ నగరానికి కొత్త సొబగు..

- కాకతీయ వైభవానికి సరికొత్త వెలుగు
- రూ.6.20 కోట్లతో పునరుద్ధరించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ ప్రారంభం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

2 లో

పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ, ఆయుధం: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించి, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడమే రాష్ట్రప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ఇది ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమని, పేదల కష్టాలు, బాధలు తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదల గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు, సన్నబియ్యం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని పేర్కొన్నారు. సొంతిల్లు అనేది ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవానికి ప్రతీక అని మంత్రి అన్నారు. గతంలో వివిధ దశల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్లను కూడా పూర్తి చేసి పేదలకు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 35 వేల అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఇల్లు ఎవరు నిర్మించారన్నది కాకుండా, అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందాలన్నదే ప్రభుత్వ విధానమన్నారు.
ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే మొదటి దశలో 4.5 లక్షల ఇళ్లను, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లను, ఇప్పటివరకు హైద్రాబాద్ తో (మిగతా 2 లో..)

రైతుకు అండగా.. సాగుకు భరోసాగా

- రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

బ్యాంకింగ్ సేవలు విస్తరించాలి

- ఎంపీ డా. కడియం కావ్య
- బ్యాంకింగ్ సేవల విస్తరణపై లోక్‌సభలో ప్రస్తావన



2 లో

హర్ ఘర్ తిరంగాతో 'వికసిత్ భారత్' సంకల్పాన్ని చాటుదాం

- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- ఇంటింట జాతీయ జెండాను ఎగరవేయాలని పిలుపు

వరంగల్, ఆయుధం: మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, ప్రతి ఒక్కరూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు సూచనల మేరకు వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం శివనగర్ 34వ డివిజన్ 170వ బూత్ పరిధిలోని తన నివాసంపై మాతృమూర్తి తో కలిసి జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ, త్రివర్ణ పతాకం దేశ ప్రజలందరికీ నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం 2022 నుంచి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోట్ల మంది ప్రజలను భాగస్వామ్యం చేస్తూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగరవేసి, 'వికసిత్ భారత్' నిర్మాణంలో మన ఉమ్మడి కట్టుబాటును చాటాలని ఆయన కోరారు. దేశభక్తిని చాటే ఈ మహా యజ్ఞంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని రవికుమార్ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామం, ప్రతి డివిజన్, ప్రతి బూత్ పరిధిలో బీజేపీ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

బ్యాంకింగ్ సేవలు విస్తరించాలి

- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య
- ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనతో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణపై లోక్‌సభలో ప్రస్తావన

వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (PM JDY) కింద ఆర్థిక సేవల పరిస్థితి, జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కార్డుల జారీ, ఆధార్ అనుసంధానం, ఖాతాల నిర్వహణ, డీబీటీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణపై కూడా వివరాలు కోరారు.

వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వరంగల్ జిల్లాలో పీఎంజేడీవై ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా.. 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగాయి. ఇదే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470కు చేరాయి. రూపే కార్డులు 2,12,030 నుంచి 2,26,409కు పెరిగాయి. జన్‌ధన్ ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ ఆపరేటివ్ ఖాతాల సంఖ్యలో తగ్గుదల నమోదైంది. 2024 మార్చిలో 2,28,257 ఖాతాలు ఆపరేటివ్‌గా ఉండగా.. 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. పీఎంజేడీవై ఖాతాలకు అనుసంధానమైన డీబీటీ పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ, జిల్లాలో జనధన్ ఖాతాల సంఖ్య పెరగడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఖాతాలు తెరవడమే కాకుండా అవి నిరంతరం వినియోగంలో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేందుకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరం చేయాలన్నారు. డిజిటల్ చెల్లింపులపై అవగాహనను మరింత విస్తరించి, మహిళలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు సహా ప్రతి వర్గానికి ఆర్థిక అక్షరాస్యత కల్పించాలని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు, డీబీటీ ప్రయోజనాలు అందేలా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలి అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

పోలీస్ ఏఆర్ఎస్ఐ గుండెపోటుతో మృతి

హనుమకొండ, ఆయుధం: వరంగల్ కమిషనరేట్ ఆర్మూర్ రిజర్వ్ విభాగంలో ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్. శామ్యూల్ (57) సోమవారం ఉదయం హనుమకొండలోని ప్రకాశ్ రెడ్డి పేట జంక్షన్ వద్ద గల తన నివాసంలో ఆకస్మిక గుండెపోటుతో మృతి చెందారు. విధులకు హాజరయ్యేందుకు బయలుదేరుతున్న సమయంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. 1989న పోలీస్ శాఖలో విధుల్లో చేరిన శామ్యూల్ సుమారు 37 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో సేవలందించారు.

ఆయన మృతి పట్ల పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్, పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం గద్దె కూల్చడం దుర్మార్గం

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- వరంగల్ జిల్లా నర్సంపేట లో బిఆర్ఎస్ ధర్నా

నర్సంపేట, ఆయుధం : ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ప్రజలు ప్రేమతో ప్రైవేట్ స్థలంలో మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే దాన్ని మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేయడం అత్యంత దారుణ విషయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నర్సంపేట పట్టణంలో దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేసిన ప్రాంతాన్ని ఎర్రబెల్లి దయాకర్ రావు, వినోద్ కుమార్ సందర్శించారు. స్థానిక పాటికి నర్సంపేట పట్టణ జంక్షన్ లో రోడ్డుపై ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో పెద్ది సుదర్శన్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించిన నేపథ్యంలో ఆ గౌరవాన్ని ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రైవేట్ స్థలంలో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని కూల్చి వేయడం ద్వారా ప్రభుత్వం తన విష పూరిత కుట్రను బయట పెట్టుకుందని అన్నారు. అదే స్థలంలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని పెట్టాలని, లేకుంటే చట్టపరంగా, న్యాయపరంగా ముందుకు వెళ్తామని వినోద్ కుమార్ ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

వరంగల్ నగరానికి కొత్త సొబగు..

- కాకతీయ వైభవానికి సరికొత్త వెలుగు
- రూ.6.20 కోట్లతో పునరుద్ధరించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ ప్రారంభం – మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ, ఆయుధం: వరంగల్ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా రూ.6.20 కోట్ల వ్యయంతో పునరుద్ధరించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మ్యూజికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటెన్, ప్రత్యేక లేజర్ షోను మంత్రి వీక్షించారు. కాకతీయుల చరిత్ర, పరిపాలనా వైభవం, కళలు, సంస్కృతి, శిల్పకళను వెలుగు, సంగీతం, దృశ్యాల సమ్మేళనంతో కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించిన తీరు ఆకట్టుకుంది. చరిత్ర పుస్తకాల్లో చదివే కాకతీయుల ఘనతను సజీవ దృశ్యాల రూపంలో సందర్శకులకు పరిచయం చేసేలా లేజర్ షోను రూపొందించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, కాకతీయుల ఘన చరిత్రకు ప్రతీకగా నిలిచిన వరంగల్ నగరంలో పర్యాటక, సాంస్కృతిక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. పునరుద్ధరించిన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ నగర ప్రజలకు సేదతీరే ఆహ్లాదకర ప్రదేశంగా, సందర్శకులకు చారిత్రక అనుభూతిని కలిగించే పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుందని తెలిపారు. పునరుద్ధరణలో భాగంగా గార్డెన్ సుందరీకరణ, పచ్చదనం, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచినట్లు మంత్రి వివరించారు. కాకతీయుల కళా వైభవం, నిర్మాణ నైపుణ్యం, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు చేరవేసేలా ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, కుడా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు అండగా.. వ్యవసాయానికి భరోసాగా..

- రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- రైతు మేళాలో నేర్చుకున్న కొత్త సాగు పద్ధతులను తోటి రైతులతో పంచుకోవాలి
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండ, ఆయుధం: రైతును రాజుగా చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో నిర్వహించిన జిల్లాస్థాయి రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.2,500 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రైతుల కోసం నెలకు సగటున రూ.5,250 కోట్లు వివిధ రూపాల్లో ఖర్చు చేస్తోందని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రభుత్వం తీసుకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమన్నారు. యాసంగి సీజన్‌లో రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం పూర్తి మద్దతు అందించిందని, ధాన్యం కొనుగోలు సమయంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమేనని మంత్రి పేర్కొన్నారు. గతంలో తగిన గోదాముల నిర్మాణం, ధాన్యం నిల్వకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదాముల సామర్థ్యాన్ని దాదాపు రెట్టింపు చేసిందని చెప్పారు.

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిందని, రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం ఇదేనని మంత్రి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులు, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. భూభారతి విధానం ద్వారా భూములకు స్పష్టమైన హక్కులు, టైటిల్, భూ రికార్డులు, మ్యాప్ తదితర వివరాలను అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులు, భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అందించి సమగ్ర భూ సర్వేకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో భూ రికార్డులను క్రమబద్ధీకరించి భవిష్యత్తులో భూ వివాదాలు, ఆక్రమణలు, హక్కుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. రాష్ట్రంలోని భూముల యజమానులు సంతృప్తిగా ఉండటమే ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వానికి నిజమైన ఆనందమని మంత్రి పేర్కొన్నారు.

వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే పంటలను ఎంచుకోవాలని, నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల సూచనలను రైతుల అనుభవంతో సమన్వయం చేసుకుని ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతు మేళాల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ప్రగతిశీల రైతులు అందించే సూచనలు, నూతన సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సానుకూల దృక్పథంతో స్వీకరించి, ఆ జ్ఞానాన్ని తోటి రైతులతో పంచుకోవాలని అన్నారు.

"శాస్త్రవేత్తలకంటే రైతులే గొప్ప శాస్త్రవేత్తలు. ఎన్నో ఏళ్లుగా నేలను, నీటిని, పంటలను, ప్రకృతిని పరిశీలించిన అనుభవం రైతులకు ఉంది. ఆ అనుభవానికి శాస్త్రీయ పరిజ్ఞానం తోడైతే వ్యవసాయంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు" అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, జిల్లా హార్టికల్చర్ అధికారి కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తున్న కేంద్ర మోడీ సర్కార్

- ప్రజా సమస్యలను గాలికొదిలిన బిజెపి ప్రభుత్వం
- అక్రమార్కులకు అడ్డాగా బీజేపీ
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు
- సిపిఐ ప్రజా చైతన్య ప్రచారయాత్ర ప్రారంభం

జనగామ, ఆయుధం: కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ ప్రజా సమస్యలను బిజెపి ప్రభుత్వం గాలికొదిలేసిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు సిపిఐ ప్రజా చైతన్య ప్రచారయాత్ర సోమవారం జనగామ పట్టణంలో ఉత్సాహపూరితంగా సాగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. మోడీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తూ ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో ముందుకు సాగుతున్నారని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ ను పరుస్తూ లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తూ ప్రజల సంక్షేమం మరిచి ప్రజాస్వామ్య గొంతును, ప్రజల గొంతుకను అణిచివేస్తూ కేంద్రం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కుతున్నదన్నారు. ప్రజలపై వారికి చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. బీజేపీ అక్రమార్కులకు అడ్డాగా మారిందని,అయోధ్య రామ మందిరంలో కానుకల చోరీకి పాల్పడ్డ వారు, దేశంలో వివిధ స్కాములకు పాల్పడిన వారు బిజెపిలో ఉన్నారని అన్నారు. నిరంతరం పేదల, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడే కమ్యూనిస్టులుగా తాము ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని చెప్పారు. బిజెపి పాలనకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్త పాదయాత్రలు ఆగస్టు 6 నుండి ప్రారంభమై దేశవ్యాప్త పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై, ఈ జాత ద్వారా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ఉన్న ప్రజా సమస్యల పైన పోరాటాలు కొనసాగిస్తూ మార్పు రావాలి మోడీ ప్రభుత్వం దిగాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీ పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ 1 తేదీన ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో జరగబో బద్లావ్ జరూరిహై ర్యాలీతో ముగుస్తాయని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1వ తేదీన ఛలో ఢిల్లీ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్న, నాయకులు చొప్పరి సోమయ్య, చామకూర యాకూబ్, గుగులోతు సఖి, డి.నగేష్, ఐలయ్య, బాణాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మోడీ వినాశనకర విధానాలకు ప్రతిఘటన తప్పదు

- రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో
- స్తంభించిన ట్రాఫిక్ - నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

వరంగల్, ఆయుధం: స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు, లేబర్ కోడ్స్ లాంటి వినాశనకర విధానాలతో రైతులను కార్మికులను అధోగతి పాలు చేస్తున్న మోడీ ప్రభుత్వానికి ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కేయం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, జిల్లా కన్వీనర్లు చుక్క మొగిలి, సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, సుధమల్ల భాస్కర్, వల్లందాస్ కుమార్, ఏఐసిటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐఎన్ టియుసి జిల్లా కార్యదర్శి పాశం రవి, ఐఎఫ్ టియు జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐసీసీటియు జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో పిలుపులో భాగంగా వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో భారీ రాస్తారోకో చేపట్టారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. ఈ క్రమంలో పోలీసులు కలుగజేసుకొని రాస్తారోకో చేస్తున్న రైతు కార్మిక సంఘాల నాయకులను బలవంతంగా అరెస్టు చేసి ఆందోళనను విరమింప చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్వదేశీ నినాదం పేరు చెప్పి ఆచరణలో అమెరికా లాంటి విదేశాలకు అనుకూలంగా విధానాల రూపకల్పన చేసి స్వదేశీ వ్యవసాయాన్ని రైతులను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని ఈ క్రమంలో రైతు ఆత్మహత్యలు పెరిగి పోతున్నాయని రైతులు వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా కార్మికులుగా మారిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగ ఉద్యమానికి ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని మద్దతు ధర రుణ విముక్తి చట్టం చేయాలని కేంద్ర విద్యుత్తు విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తిలో కీలక భూమిక పోషించే కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబరు కోడ్స్ ను తక్షణమే రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా అమలు చేయాలని కోరారు. లేకపోతే రైతులు కార్మికులు ఐక్యంగా ప్రజలందరినీ కలుపుకొని ఉద్యమిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు సింగతి సాంబయ్య, నర్ర ప్రతాప్, నెట్టెం నారాయణ, చుంచు జగదీశ్వర్, మాలోతు సాగర్, పుల్ల రమేష్, ఓదెల రాజన్న, బండి వెంకటేశ్వర్లు, హంసల్ రెడ్డి, బొల్లు ఎల్లయ్య, ఎంఏ.పాషా, చుక్క శోభ, పూలక్కా, పృద్వి, నర్సింగం, బాబు, రామస్వామి, రాజేందర్, ఐలయ్య, ఎగ్గని మల్లికార్జున్, మాలి ప్రభాకర్, ఓదేలు, ఐతం నాగేష్, నరసయ్య, రవి, సుమంత్, చారి, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ వారోత్సవాల సభలు జయప్రదం చేయండి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

హనుమకొండ, ఆయుధం: సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో హనుమకొండలో జరుగు AISF 90 వసంతాల రాష్ట్రస్థాయి ముగింపు వారోత్సవ సభలు జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని గ్రేటర్ ప్రెస్ క్లబ్‌లో సభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. AISF హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్ మాట్లాడుతూ,

600 మంది ప్రతినిధులతో రాష్ట్రస్థాయి వారోత్సవ మహాసభలు సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో జరిగే మూడు రోజుల కార్యక్రమాలకు తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా AISFలో పనిచేసిన మాజీ నాయకులు, ప్రస్తుత నాయకులు పాల్గొంటారని మొదటిరోజు భారీ ర్యాలీ బహిరంగ సభ, రెండవ రోజు మూడవ రోజు వారోత్సవ మహాసభలు జరగనున్నట్లు డెలిగేట్స్ అందరికీ మూడు రోజులపాటు వసతి, భోజనం, కాన్ఫరెన్స్ హాల్ తదితర సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేయనున్నట్లు ఈ సమావేశంలో విద్యారంగ సమస్యలు పరిష్కార మార్గాలు ఏఐఎస్ఎఫ్ సంఘ నిర్మాణం భవిష్యత్తు ఉద్యమాలపై పలు కీలకమైన నిర్ణయాలు జరగనున్నట్లు తెలిపారు. AISF తొమ్మిది దశాబ్దాల పోరాట చరిత్రను స్మరించుకోవడంతో పాటు, ప్రస్తుత విద్యారంగ సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ విద్యార్థి ఉద్యమానికి నూతన కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, జిల్లా నాయకులు కే అజయ్, నాగరాజు, వంశీ, రాజు, శ్రావణ్, ముఖేష్, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి..)

కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను మంజూరు చేసేసట్లు మంత్రి తెలిపారు. అనంతరం మూడో, నాలుగో దశల్లోనూ ఇళ్లను మంజూరు చేస్తామని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని అందించే వరకు ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ పక్షపాతం చూపడం లేదని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం, మంత్రుల నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు కూడా అర్హత ఆధారంగా ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. పేదోడు ఏ కులం, ఏ మతం, ఏ పార్టీకి చెందినవాడన్నది కాకుండా, అర్హతే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని దశలవారీగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. నిర్మాణం ఏ దశలో ఉందో పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి విడత నిధులను విడుదల చేస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర